
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## అమరజీవికి ఘన నివాళులర్పించిన ఎంపి వేమిరెడ్డి



**నెల్లూరు సిటీ నవంబర్ 1 ప్రభాతవార్త** ఆంద్రప్రదేశ్ అవరతరణ దినోత్సవం పురస్కరించుకొని రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డినెల్లూరులోని తన కార్యాలయంలో అమరజీవికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతు ఆంధ్రరాష్ట్రం కోసం తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టిన మహానీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఆయన కొనియాడారు. ఆయన త్యాగ ఫలితంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని చెప్పారు. అలాంటి మహానీయుల అడుగుజాడలలో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు. అమరజీవి సాధించిన ఆంధ్రరాష్ట్రం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారని అన్నారు. పేద, బడుగు బలహీన వర్గాలకోసం పాటుపడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరు అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

## బాల సదన్ భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



**నెల్లూరు టౌన్, నవంబర్ 1, ప్రభాతవార్త** నెల్లూరు నగరం బట్వాడిపాలెం సమీపంలోని నీలగిరి సంఘం తెలుగుగంగ ప్రాజెక్టు అతిధి గృహం ప్రాంగణంలో బాల సదన్ భవన నిర్మాణానికి స్థలాన్ని కలెక్టర్ ఎం.హరినారాయణన్ బుధవారం పరిశీలించారు. తెలుగు గంగ ప్రాజెక్టు అతిధి గృహ ప్రాంగణంలో బాలసదన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. భద్రతాపురంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాల అనుకూలమైన సుమారు 50 సెంట్లు స్థలాన్ని బాలసదన్ భవన నిర్మాణానికి కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సీఎస్‌ఆర్ నిధులతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. కలెక్టర్ వెంట నెల్లూరు రూరల్ తహశీల్దార్ సోమ్లానాయక్, సర్వేయర్ ఎం.ఏడుకొండలు ఉన్నారు.

## గౌతంరెడ్డి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు




**ఆత్మకూరు, నవంబర్1, ప్రభాతవార్త** :ఆంధ్రరాష్ట్ర దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి జయంతి సందర్భంగా నెల్లూరు డైకస్‌రోడ్డు సెంటర్‌లో గురువారం ఆవిష్కరించనున్న విగ్రహ ఏర్పాట్లను ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి , ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా వచ్చే ప్రజలు, నాయకులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. దివంగత మంత్రి గౌతంరెడ్డి విగ్రహావిష్కరణకు రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, నియోజకవర్గాల శాసనసభ్యులు, జిల్లా నలుమూలల నుండి ప్రజాప్రతినిధులు , వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరవుతారని వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు.

## గర్భిణీల్లో రక్తహీనతకు చర్యలు చేపట్టండి



**నెల్లూరు నవంబర్ 1, ప్రభాతవార్త-వైద్యం** గర్భిణీల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆర్యోగశాఖాధికారి డాక్టర్ ఎం పెంచలయ్య ఆదేశించారు. బుధవారం నగరంలోని సంతపేటలో ఉన్న డీఎంహెచ్‌ఓ కార్యాలయ సమావేశ మందిరంలో శిశుమరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జిరిగిన శిశు మరణాలపై సంబంధిత వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది నుంచి సమగ్ర సమాచారం సేకరించి, శిశు మరణాలు సంభవించిన ఆసుపత్రుల నుంచి సేకరించిన సమాచారముతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో శిశు మరణాలను నివారించాలంటే గర్భిణీల్లో రక్తహీనత నివారణ, సకాలంలో వైద్యపరీక్షలు, ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించడం, తల్లిపాలు పట్టించడం, తొలిదశలోనే పెరుగుదల సరిగాలేని పిల్లలన వారికి ఎన్‌ఆర్‌సి ద్వారా సంపూర్ణ చికిత్స అందించాలని పెంచలయ్య ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు చిన్నపిల్లల వైద్య నిఫుణులు డాక్టర్ చిరంజీవి, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ శెలీనాకుమారి, డాక్టర్ బ్రిజిత, జి మంజుల, బి శ్రీనివాసరావు, కె సహన, సంబంధిత వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలు అన్ని రంగాలలోముందంజలో ఉండాలి



**కలువాయి నవంబర్ 1 ప్రభాతవార్త** బాలికలు విద్యతోపాటు అన్ని రంగాలలో ముందంజలోఉండాలని జిల్లా అకడామిక్ మానటరింగ్ అధికారి జి.సుధీర్‌బాబు తెలిపారు. బివిఎన్‌ఆర్ జడ్‌పిహైస్కూల్‌ప్లస్ నందు 6,9 తరగతులకు జరుగుతున్న స్టేట్ ఎడ్యుకేషన్ అచ్యుమెంట్ సర్వేనమోనా పరీక్షను జిల్లా సమగ్ర శిక్ష విద్యా విషయక పరిశీలనాధికారి సుధీర్‌బాబు బుధవారం పరిశీలించారు. హైస్కూలప్లస్ జూనియర్ బాలికల కళాశాల నందు విద్యార్ధినిలకు కెరీర్ గైడెన్స్ విద్యా విషయాల నందు బాలికలు ఏలా రాణించాలి ముందడుగు వేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్ధులు మాకు మరింత అవసరమని ఈ సందర్భంగా జిల్లా అధికారి దృష్టికి తీసుకొని వెళ్లారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జి.శేషగిరిరావు, హైస్కూల్ ప్లస్ ఉపాధ్యాయులు ప్రసాద్‌రావు, రాంబాబు, కృష్ణయ్య, శ్రీనివాసులు, జివి రమణయ్య తదితరులు పాల్గోన్నారు.

## నేడు మేకపాటి గౌతంరెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ

**ఆత్మకూరు, నవంబర్1, ప్రభాతవార్త** : నెల్లూరు పట్టణంలోని డైకస్‌రోడ్డు సెంటర్‌లో దివంగత రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతంరెడ్డి కాంస్య విగ్రహాన్ని గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరిస్తారని మేకపాటి కుటుంబ సభ్యులు తెలిపారు. డైకస్‌రోడ్డు సమీపంలోని స్థానికుల కోరికమేరకు మేకపాటి కుటుంబం ఈ కాంస్య విగ్రహ ఏర్పాటు చేస్తున్నారు. నెల్లూరులో జరిగే కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు , రాజ్యసభ సభ్యులు ,జిల్లాలోని శాసనసభ్యులు, జిల్లాలోని వివిధ విభాగాలకు చెందిన వైసిపి నాయకులు , కార్యకర్తలు , మేకపాటి కుటుంబ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని మేకపాటి కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఘనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ పురస్కారాలు



**నెల్లూరు అర్బన్, నవంబర్1, ప్రభాతవార్త** బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బ కళాక్షేత్రంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ సంజనాసింహ, జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, ఆర్డిఓ మలోలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములుగారు 1901 మార్చి 16న మద్రాసులో జన్మించడం జరిగిందన్నారు. అప్పట్లో మద్రాసు రాష్ట్రంలో నివసిస్తున్న తెలుగువారికి మద్రాశీయులుగా గుర్తింపు వుండేదని, తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని శ్రీ పొట్టి శ్రీరాములు గారు ఆమర నిరాహార దీక్ష చేసి 1952లో అసువులు బాసిన సందర్భంగా, ఆయన ప్రాణత్యాగ ఫలితంగా 1953లో ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పాటు కావడం జరిగిందన్నారు. ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు మన అందరి హృదయాల్లో అమరజీవి అయ్యారని నేడు మన మధ్య లేకపోయినప్పటికీ వారు చేసిన ప్రాణత్యాగం ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ తెలుగు భాష కోసం తెలుగు ప్రజల కోసం ఆంధ్రరాష్ట్ర అవిర్భావానికి ప్రాణత్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా వాసులు కావడం మనకెంతో గర్వకారణమని, పొట్టి శ్రీరాములు జన్మించిన ఈ జిల్లాలో కలెక్టర్ గా పనిచేయడానికి అవకాశం కల్గడం ఎంతో గర్వంగా ఉందన్నారు. 1947 ఆగస్టు 15వ దేశానికి స్వాతంత్రం సిద్ధించిన తరువాత, 1950 జనవరి గణతంత్ర ప్రజాస్వామ్య దేశంగా ఏర్పడిన తరువాత, ఈ రోజు ఉన్నటువంటి రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడేవారికి ప్రత్యేకంగా రాష్ట్రం ఉండాలన్న లక్ష్యంతో ఆంధ్రరాష్ట్ర సాధనకు శ్రీ పొట్టి శ్రీరాములు ప్రాణాలు అర్పించడంతో 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడటం జరిగిందన్నారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాలను ఘనంగా జరుపుకోవడంతోపాటు శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకోవడం జరుగుతుందన్నారు. స్వాతంత్ర సమరయోధులు కె.వి చలమయ్య మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని మహాత్మా గాంధీ మన్ననలు పొందిన గొప్ప వ్యక్తి అన్నారు. వారి జీవిత చరిత్రను వివరిస్తూ ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులు కెవి.చలమయ్యను ప్రత్యేకంగా సత్కరించారు. జడ్పీసిఈఓ చిరంజీవి, డిఆర్డిఏ, డ్వామా, ఐసిడిఎస్ పిడిలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, హేనసుజన, డిఐఓ గంగాభవాని, డిటిసి చందర్, ఐటిడిఏ పిఓ మందారాణి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జిల్లా వ్యవసాయశాఖాధికారి సుధాకర్‌రాజు, జిల్లా అధికారులు, విద్యార్థినీ విద్యార్ధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవికి ఘననివాళులు



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 1, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని మొదటగా కస్తూర్బా కళాక్షేత్రం నందు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ఇతర అధికారులు, నాయకులతో పాటు జాతీయ పతాకావిష్కరణ గావించి, వేడుకలలో పాల్గొని తదుపరి జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని వివరించారు. దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిందని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం కొరకు 56 రోజులు నిరాకంటంగా దీక్ష చేసిన మహనీయుడు అమరజీవి, ఆంధ్రరాష్ట్రం కోసం తనను తాను బలిదానం చేసుకున్న గొప్ప త్యాగమూర్తి అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన కృషి, దీక్ష ఫలితమే ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని వివరించారు. దృఢ సంకల్పం ఉన్న గొప్ప వ్యక్తి, ప్రేమ, వినయం, సేవ, నిస్వార్థతలు మూర్తీభవించిన స్వరూపమే పొట్టి శ్రీరాములు. శ్రీపొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి స్మరించుకోవాలని తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, డీపీఓ, ఇతర సిబ్బంది తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# గంజాయి రవాణాపై ఉక్కుపాదం



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 1, ప్రభాతవార్త** నగరంలోని స్థానిక ఎస్‌ఈబీ ఎక్సైజ్ పోలీసు స్టేషన్లో జిల్లా ఏఎస్‌పీ, ఇన్‌ఛార్జి ఎస్‌ఈబీ డైరక్టర్ హిమవతి గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు ముద్దాయిలు అరెస్టు చేసిన సందర్భంగా విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను విక్రయాలను నిర్మూలించాలని ఉద్దేశంతో జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్న నేపధ్యంలో ఎస్‌ఈబీ వారికి రాబడిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా కల్లపల్లి నాగేంద్ర(40), కళ్ళపల్లి హరికృష్ణ(17), షేక్ సలీం భాష(47), కే.భాస్కర్(51), మురుగేశ్(50)లను విచారించగా వారి వద్ద నుండి సుమారు 40 కేజీల గంజాయి, రూ.95000 నగదు, 5 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు, వీటి విలువ ప్రస్తుత మార్కెట్లో సుమారు రూ.6లక్షలు ఉంటుందని వివరించారు. ఎవరికైనా మాదకద్రవ్యాల అక్రమ రవాణా విక్రయాలపై సమాచారం తెలిస్తే తమకు అందించాలని సమాచారం అందించిన వారి వివరాలుగోప్యంగా ఉంచుతామని ఎతలిపారు. మాదకద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ముఖ్యంగా యువతకు తెలిపారు. అరెస్టైన ముద్దాయిలు అందరూ సులభంగా డబ్బు సంపాదించాలన్న దృకృధంతో గంజాయి అక్రమ రవాణా విక్రయాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ దాడుల్లో నెల్లూరు సెబ్ సూపరింటెండెంట్ కృష్ణ కిషోర్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం, కావలి, కలిగిరి పోలీసు స్టేషన్‌లో సిబ్బందిని జిల్లా అడిషనల్ ఎస్పీ హిమవతి ప్రత్యేకంగా అభినందించారు.

# ఎన్ని పరిశ్రమలు వచ్చినా మా బతుకులు ఇంతే



**ముత్తుకూరు, నవంబర్1, ప్రభాతవార్త** మండలంలోని నేలటూరు గ్రామం చుట్టుపక్కల ఎన్ని పరిశ్రమలు వచ్చినా మా బతుకులు ఇంతేనని నేలటూరు గ్రామానికి చెందిన జానకిరామిరెడ్డి అన్నారు. బుధవారం సైయిల్ థర్మల్ పవర్‌ప్లాంట్ వద్ద గేట్లు మూసివేసి కంపెనీ గేటు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ ప్రాజెక్టులు ఎన్ని వచ్చినా మా బతుకులు బూడిదలో మగ్గిపోవాల్సి వస్తుందని వాపోయారు. పవర్‌ప్లాంట్ల వల్ల కాలుష్య ప్రభావంఎక్కువ ఉండటంతో స్థానికులుగా అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. 2009 నుండి 2014వరకు గాయత్రి పవర్ ప్రాజెక్టను ఇప్పుడు సైయిల్ పవర్ ప్రాజెక్టుగా ఉందని అప్పటి నుంచి ఇప్పటివరకు నేలటూరు గ్రామానికి 5ఉద్యోగాలు కల్పించడం విడ్డూరంగా ఉందన్నారుజముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిచట్టసభల్లో 75శాతం స్థానికంగా చదువుకున్న వారికే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చట్టం తీసుకురావడం జరిగిందని కంపెనీల యాజమాన్యానికి వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పదేపదే గ్రామాల్లోచదువుకున్న నిరుద్యోలు ఉన్నారని వారికి అవకాశాలు కల్పించాలన్నారు. వారికి ఉద్యోగాలు అడిగితే బాత్‌రూమ్స్ క్లీనింగ్ వంటి ఉద్యోగాలు కల్పిస్తారా మీరేమో ఆదాయాలతో పబ్బం గడుపుకుంటూ ఇతర ప్రాంతాల వారిని తీసుకుని వచ్చి వారికి లక్షల రూపాయల జీతాలు ఇప్పిస్తారా అని ఘాటుగా విమర్శించారు. ఒక్కప్పుడు సస్యశ్యామలంగా ఉన్న గ్రామాలు ఇప్పుడు వల్లకాడిలా మారాయన్నారు. మరోసారి కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి మా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లాల్సిందిగా కోరతామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మేకపాటి గౌతంరెడ్డి 53వ జయంతి

- ఘనంగా ఏర్పాట్లు
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి




**ఆత్మకూరు, నవంబర్1, ప్రభాతవార్త** : ఆంధ్రప్రదేశ్ దివంగత యువమంత్రి మేకపాటి గౌతంరెడ్డి 53వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహిస్తున్నామని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. దివంగత మంత్రి గౌతంరెడ్డి 5శాఖల మంత్రిగా రాష్ట్రానికి, జిల్లాకి, ఆత్మకూరు నియోజకవర్గానికి ఎనలేని సేవ చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆఖరి శ్వాసవరకు మెట్టప్రాంత ప్రజల కాంక్షే ఆకాంక్షగా స్వర్గీయ మేకపాటి గౌతంరెడ్డి బ్రతికారని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పరిశ్రమలు, ఐటి, నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించారన్నారు. తద్వారా వలసలను అరికట్టి రాష్ట్ర యువతకు ఉపాది అవకాశాలు అందించాలన్న ఆలోచనలను ఆచరణలో పెడుతుండగా అస్తమించారని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. అన్న మరణానంతరం గురువారం ఆయన జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు , జాబ్‌మేళా లో యువత భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆత్మకూరులో ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. 29కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు .2వేల యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కోరారు. దివంగతమంత్రి మేకపాటి గౌతంరెడ్డి కలలను నిజం చేయడం ఆత్మకూరు ప్రజల ఆకాంక్షను నెరవేర్చడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు . దివంగత మంత్రి మేకపాటి గౌతం అన్న కలలను నిజం చేయడం, ఆత్మకూరు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే తన లక్ష్యమని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. అందులోభాగంగానే ఆత్మకూరు డెవలప్‌మెంట్‌ఫోరంను స్థాపించామన్నారు. మేకపాటి గతమ్ అన్న ఆత్మకూరు ప్రజలకిచ్చిన హామీ ని 4కోట్ల రూపాయలతో బస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి ఇప్పటికే నెరవేర్చామన్నారు. నియోజకవర్గ ముఖచిత్రాన్ని మార్చడమే ధ్యేయంగా అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం ఎడిఎఫ్ సదస్సులు నిర్వహిస్తూ మేధావులు, నిష్ణాతులతో అభిప్రాయాలను సేకరించి ప్రగతి వైపు ప్రణాళికగా ముందుకు సాగుతున్నామన్నారు. యువతకు ఉపాది అవకాశాలిచ్చే నైపుణ్య శిక్షణ ప్రోత్సాహక కార్యక్రమాల పట్ల మేకపాటి కుటుంబం ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల 58దేవాలయాల అభివృద్ధికోస ం 5.8కోట్ల రూపాయల నిధులు సాధించామన్నారు. అన్నపై ప్రేమ, ముఖ్యమంత్రి మీద అభిమానం వెరసి తనను గెలిపించిన ఆత్మకూరు నియోజకవర్గంలో మౌళిక సదుపాయాలతో కూడిన అభివృద్దే తన మార్గమని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు.

## సంగంలో అమరజీవికి ఘన నివాళి



**సంగం నవంబర్ 1ప్రభాతవార్త** సంగం తహసిల్దారు ప్రాంగణంలో వున్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి తహసిల్దారు నాగరాజు, ఆర్యవైశ్యనేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చా రు. ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భంగా నేతలు, అధికారులు అమరజీవికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసిల్దారు నాగరాజు మాట్లాడుతు ఆంధ్రరాష్ట్రంకోసం అమరజీవి తన ప్రాణాలను సైతం పణంగా పెట్టారని అన్నారు. ఆయన త్యాగ ఫలితంగా 1956 నవంబర్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని అన్నారు. అమరజీవి జీవితం నేటి తరానికి ఆదర్శం అని అన్నారు. ఈ సందర్భంగా అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్యనేతలు. డిప్యూటి తహసిల్దారు, అధికారులు పాల్గొన్నారు.

## దేవరాల వివాహానికి హాజరైన బొల్లినేని



**వింజమూరు, నవంబర్1, ప్రభాతవార్త** : మండలంలోని బొమ్మరాజుచెరువు గ్రామానికి చెందిన దేవరాల పెంచలయ్య-పద్మ ల కుమారుడు ప్రవీణ్‌సాయి-రమ్యల వివాహానికి ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావ్ హాజరయ్యారు. స్థానిక ఎస్‌వి కన్వెన్షన్ హాల్లో జరిగిన వివాహ వేడుకల్లో బొల్లినేని, వింజమూరు టిడిపి నేతలు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో చల్లా వెంకటేశ్వ ర్లు-భాగ్యలక్ష్మి, మాజీ జడ్పీటిసి సభ్యులు తిప్పిరెడ్డి నారపరెడ్డి, గురజాల వెంకటరమణయ్య, గూడా నరసారెడ్డి, చల్లా శ్రీనివాసులు-శ్రీదేవి, యానాదయ్య - సుబ్బమ్మ, పాముల సుబ్బరాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

## డయాలసిస్ యూనిట్ మంజూరు పట్ల గణపం హర్షం



**వింజమూరు, నవంబర్1, ప్రభాతవార్త** :వింజమూరు ప్రభుత్వ సా మాజిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 5బె డ్లతో కూడిన డయాలసిస్ యూనిట్‌ను మంజూరు చేయడం ప ట్ల జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గణపం మాట్లాడుతూ ఉదయగిరి మెట్టప్రాం తంలో అనేకమంది డయాలసిస్ బాధితులు ప్రతి వారం వేల రూ పాయలు వెచ్చిస్తూ వైద్యంకోసం ఆత్మకూరు, నెల్లూరు ఆసు పత్రులకు వెళుతున్నారు . రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చొరవతో డయాలసిస్ యూనిట్ ను మంజూరు చేశారు. యూనిట్ మంజూరుకు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ వింజమూరు వచ్చిన సందర్భంగా ఇక్కడ డయాలసిస్ బాధితుల గురించి జడ్పీటిసి సభ్యులు వివరించడంతో స్పందించిన ఆయన డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టారన్నారు. ప్రస్తుత ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కూడా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్ళారని దాంతో యూనిట్ మంజూరు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 23డ యాలసిస్ కేంద్రాలను మంజూరు చేయగా వాటిలో వింజమూరుకు ఒకటి కేటాయించడం హర్షణీయమన్నారు.

## పచ్చి శనగలు పంపిణీకి సిద్ధం

**వింజమూరు, నవంబర్1, ప్రభాతవార్త** : వింజమూరు మండల పరిది . లోని మెట్టపంటలను సాగుచేస్తున్న రైతులకు పచ్చిశనగలు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారి శివ నాగప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రబీసీజన్‌లో రైతులు సాగుచేసే పచ్చిశనగ పంట జెజి-11, కెఎకె-2 రకం పచ్చిశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చిశనగవిత్తనాలు కావాల్సి న రైతులు వారి పరిధిలోని ఆర్‌బికెల్లో ని గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రైతులు వారి పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఒక రైతుకు 5ఎకరాలకు 200కేజీలు అందజేస్తామన్నారు. జెజి-11 రకం 8100రూపాయలు కాగా 40శాతం సబ్సిడీతో 4860రూపాయలకు, కెఎకె-2 రకం 14050రూపాయలు కాగా 40శాతం సబ్సిడీతో 8430రూపాయలకు అందజేస్తామన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు



**కావలి, నవంబరు 1 ప్రభాతవార్త** ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని ఆర్యవైశ్య నేతలు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కావలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి బుధవారం వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య నేతలు తిరివీధి ప్రసాద్, కనమర్లపూడి వెంకట నారాయణ, డాక్టర్ మనోహర్‌బాబు, చీదెళ్ల కిషోర్, నల్లూరి రమేష్, పాదర్తి నాగరాజు, గొల్ల సుధాకర్, ఒరుగంటి రామకృష్ణ, నాగాచారి, నాయబ్‌లు మాట్లాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగువారందరూ ఒకే రాష్ట్రంలో వుండాలని 58 రోజులు ఆమరణ దీక్ష చేసిన సమయంలో తన భార్యను, బిడ్డను పోగొట్టుకున్నా లెక్కచేయకుండా రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. ప్రతి ఒక్కరు అమరజీవి ఆశయాల కోసం పనిచేయాలన్నారు. అమరజీవి నడియాడిన జువ్వలదిన్నె ప్రాంతం కావలి నియోజకవర్గంలో వుండటంతో ఆ ప్రాంతం పర్యాటక కేంద్రం, ఫిషింగ్ హార్బర్‌తో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి చేస్తున్నారని తెలిపారు.

## అంగరంగ వైభవంగా గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ట

**మర్రిపాడు, నవంబర్1, ప్రభాతవార్త** : మండలంలోని సన్నువారిపల్లిలో అంగరంగ వైభవంగా అంకమ్మతల్లి, గంగమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉభయకర్త గంగిరెడ్డి ఆధ్వర్యంలో అంకమ్మతల్లి, గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్టసందర్భంగా వేదపండితుల సమక్షంలో ఛండీయాగం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రనత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## అతివేగంతో కారు పల్టీకొట్టి ముగ్గురికి గాయాలు

**కావలి రూరల్, నవంబరు 1 ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా తిమ్మ సముద్రం నుండి బుధవారం కావలికి కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు కావలి రూరల్ మండలం సిరిపురం క్రాస్‌రోడ్డు వద్దకు వచ్చేసరికి కారు అతివేగంగా ప్రయాణించి అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డుకు వంద మీటర్ల దూరంలో అడవిలో పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కారు అతివేగంగా వెళ్తూ అదుపుచేయలేక పోవడంతోనే ఈ సంఘటన జరిగిందని వాహనదారులు చెబుతున్నారు.

## ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్ధనలు

ఉదయగిరి, నవంబర్1, ప్రభాతవార్త ఉదయగిరి పట్టణంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో గల ఆస్థాన ఖాధరియా ఇరాక్ దేశంలోని వాగ్దాడ్ నగరం నుండి వచ్చిన మహబూబ్ సుభానీ వారు జుబ్బా, వెంట్రుక, చిహ్నాలను ప్రతిష్టించే కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు మేళతాళాలతో బాణాసంచా పేలుల్లతో భక్తి శ్రద్ధలతో ఉదయగిరి పుర వీధులలో ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రార్ధనలు చేస్తూ ఊరేగింపుగా మసీదు దగ్గరకు చేరుకున్న భక్తులు ఈ కార్యక్రమాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉదయగిరి నలూమూలల నుండి పలు దర్గాల నుండి ముస్లిం సోదరులు, భక్తులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బాబు షూరిటీ భవిష్యత్తుకు బ్యారంటీ



**కందుకూరు, నవంబర్1, ప్రభాతవార్త** బాబు షూరిటీ భవిష్యత్తుకు గార్యంటీ కార్యక్రమం పట్టణంలోని 18వ వార్డు బంగారమ్మ గుడి ప్రాంతంలో ఉదయం నుండి ఇంటింటికి తిరిగి ప్రజల సాధక బాధలు తెలుసుకుంటూ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ముందుగా సాగారు. రాబోయే తెలుగు ప్రభుత్వంలో అమలు చేయబోయే మ్యానిఫెస్టోలోని అంశాలను స్థానికులకు వివరించారు. ఆడబిడ్డ నిధి కింద 18సంవత్సరాలు దాటిని ప్రతి మహిళకు నెలకు 1500రూపాయలు అందిస్తామని చెప్పారు. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఏడాదికి 15వేల రూపాయలు ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. మహిళలకు ఏడాదికి 3గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత మంచినీరు అందిస్తామన్నారు. ప్రతి రైతుకు ఏడాదికి 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. బీసీలకు రక్షణ చట్టం తెచ్చి అన్ని విధాలా వారికి అండగా నిలుస్తామన్నారు. పూర్ టు రిచ్ పథకం ద్వారా పేదలను సంపన్నులుగా మార్చే కార్యక్రమం అమలు చేస్తామని నాగేశ్వరరావు తెలియజేశారు. జగన్మోహన్‌రెడ్డికి ఒక్క చాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలాగా తయారు చేశారని, మరోసారి మోసపోవద్దని స్థానికులను కోరుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని, కందుకూరులో తన గెలుపుకు సహకరించాలని ఇంటూరి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, దివి శ్రీనివాసులు, రామారావు, రావి వెంకటేశ్వర్లు, అత్తంటి మాధవ, మాల్యాద్రి, దివి వెంకటేశ్వర్లు, సింగయ్య, రామలింగయ్య, శ్రీకాంత్, సుబ్బారావు, మణిశంకర్, శ్రీను, జాలయ్య, కోటేశ్వరరావు, వీరానిస్వామి, రఘు, మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, చిలకపాటిమధుబాబు, రఫీ, మున్నా, సలాం, నాగరాజు, మ నోహర్, కరిముల్లా, బ్రహ్మయ్య, తొట్టెంపూడి అశ్విని సుధారాణి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి అమృత్‌కలశ యాత్ర సభకు హాజరైన జిల్లా వాసులు



**నెల్లూరు అర్బన్, నవంబర్1, ప్రభాతవార్త** కేంద్రరక్షణ శాఖ భారత ప్రభుత్వం అక్టోబర్5 న అజాధికా అమృత మహోత్సవాలు భాగంగా అమృత కాలష్ యాత్ర ప్రారంభించడం జరిగింది. ఈ యాత్రకి సంబంధించి మేర మిట్టి మేరా దేశ్ క్యాంపెయిన్ ఢిల్లీ నుండి పార్లమెంట్ భవనమం సమీపంలో గల కర్తవ్యాపద్ నందు నిర్వహించి నెల్లూరు జిల్లాలోని 722గ్రామాల పంచాయతీ నుండి సేకరించిన మట్టి కలశములను 37మండలాల ద్వారా 25మందిని ఎంపిక చేసి నెహ్రూ యువ కేంద్రం నెల్లూరు వారి ద్వారా 25మందిని ఎంపిక చేసి మొత్తం 50మందిని ఒక బృందంగా ఏర్పరిచి వారి ద్వారా అక్టోబర్ 27న సాయంత్రం మట్టికలశాలతో జిల్లా పరిషత్ కార్యాలయంలో నెల్లూరు నుండి ఢిల్లీకి పంపడం జరిగింది. అక్టోబర్ 30న ఢిల్లీకి చేరిన బృందం మట్టి కలిశాలను ఢిల్లీలోని కర్తవ్యాపద్ నందు ఉంచి అక్టోబర్ 31 సాయంత్రం 5గంటలకు భారతదేశ ప్రధానమంత్రి అమృత్‌కలశ యాత్ర సభకు హజరైనేడు సాయంత్రం ఢిల్లీ నుండి జిల్లాకు బయలుదేరడం జరిగింది.

## ప్రతి తెలుగువారి గుండెల్లో అమరజీవికి సుస్థిర స్థానం



**కందుకూరు, నవంబర్1, ప్రభాతవార్త** తెలుగువారి గుండెల్లో అమరజీవి సుస్థిరస్థానం అని శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరన దినోత్సవం సందర్భంగా బుధవారం వైసీపీ కార్యాలయంలో శాసనస భ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అతవరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించా రు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ అమరజీవి పోటి శ్రీరాములు చేసిన నిస్వార్ధ త్యాగ ఫలం వలన ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని ఆయన అన్నా రు. నిరాడంబరుడు, నిస్వార్థపరుడు, కార్యదర్శులు అయిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగువారి గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పడుచుకున్నారన్నారు. అలాంటి మహనీయుడు మన ప్రాంతవాసి కావడం మనకు ఎంతో గర్వకారణమన్నారు. అమరజీవి అడుగు జాబల్లో ప్రతి ఒక్కరూ నడవాలని, అలాంటి మహనీయులు చిరకాలం గుర్తుంచుకోవానలి, వారి కార్యదీక్ష , పట్టుదలను ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తోకల కొండ య్య, రఫీ, గణేశం గంగిరెడ్డి, రావులకొల్లు బ్రహ్మానందం, ముప్పవరపు కిషోర్, వల్నాటి చెన్నయ్య, ఆర్యవైశ్య నాయకులు పబ్బిశెట్టి శివ, చక్కా వెంకట కేశవరావు, కోట నరసింహం, మోదదుగు శేషారావు, సుబ్బ య్య , అల్లూరయ్య, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి మాతృమూర్తి వర్ధంతికి అన్నదానం



**నెల్లూరు సిటీ నవంబర్ 1 ప్రభాతవార్త** రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాతృమూర్తి స్వర్గీయ వేమిరెడ్డి శ్యామలమ్మ 10 వవర్ధంతి సందర్భంగా నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో అన్నదానం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్కు సాయిబాబా గుడి, గీతామయి వృద్ధుల ఆశ్రమం ప్రగతి చారిటబుల్ ట్రస్టు, జనహిత వాత్సల్య ఆశ్రమాల్లో వేమిరెడ్డి సిబ్బంది అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే తన సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టిటిడి డిల్లీ స్థానిక సలహామండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు దుస్తులు పంపిణి చేశారు.

## బుచ్చి బస్టాండ్‌లో పెద్ద చెట్టును నరికివేసిన వ్యక్తులు



**బుచ్చి నవంబర్ 1 ప్రభా తవార్త** బుచ్చిరెడ్డి పాలెం బస్టాం డ్‌లో ఎంతోమందికి నీడనిస్తున్న చెట్టును కొంతమంది రాత్రి కిరాత్రి నరికివేశారు. ఆచెట్టును నరికివేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వృక్షో రక్షిత రక్షితః అని పెద్దలు చెబుతుంటే పదిమందికి నీడను ఇచ్చే చెట్టును రాత్రికి రాత్రి నరికి వేశారు. మున్సిఫల్ అదికారులు చెట్లు నరికివేస్తున్న వా రిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పదిమందికి నీడనిచ్చే చెట్టును నరికి వేయడం సరి కాదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఈవిషయం పోలీసులు దృష్టికి తీసుకొని వెళ్లగా ఆప్రాంతంలో సిసికెమెరాలు ఉన్నాయని పరిశీలిస్తామని అన్నారు.

## విద్యాశాఖాధికారి ఆకస్మిక తనిఖీ



ఉదయగిరి, నవంబర్1, ప్రభాతవార్త ఉదయగిరి మండలంలోని గండి పాలెం, వెంగల్‌రావు గ్రామాలలో గల హైస్కూల్లలో స్టేట్ ఎడ్యుకేషనల్ సర్వే పరీక్షపై అవగాహన కల్పించి నట్లు ఉదయగిరి విద్యాశాఖ అధికారి తోటశ్రీనివాసులురావు తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుండి జరిగే ఈ పరీ క్షలలో విద్యార్ధులు పాల్గొని విజ యాన్ని పొందాలని కోరారు. అనంతరం సంబంధిత స్కూల్లలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన విద్యార్ధులతో కలిసి భోజనం చేసి భోజనం ఎలా ఉంది, వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

## వరదాపురం శ్రీ సాయినాద్ స్కూల్ విద్యార్ధి అదృశ్యం

పొదలకూరు నవంబర్ 1 ప్రభాతవార్త మండలంలోని వరదాపురం గ్రామంలో ఉన్న శ్రీసాయినాధా హైస్కూల్‌లో 9 వ తరగతి చదువుతున్న విద్యార్ధి అదృశ్యం అయినట్లు పొదలకూరు పోలీసులకు పిర్యాదు అందింది. స్దానికుల సమాచారం మేరకు మంగళవారం పాఠశాలలో ఉన్న విద్యార్ధి బుధవారానికి అదృశ్యం అవడం మండలంలో చర్చిన్యాంశం అయింది. పొదలకూరు మండలంలోని ఆల్లాతుర్తి గ్రామానికి చెందిన నందకిషోర్ వరదాపురంలోని సాయినాధ హైస్కూల్‌లో తొమ్మిదోతరగతి చదువుతున్నాడు. మంగళవారం వరకు పాఠశాల హాస్టల్‌లోనే ఉన్న విద్యార్ధి మరసటిరోజుకి ఎలా అదృశ్యం అయ్యాడో అర్ధం కాక పాఠశాల యాజమాన్యం విద్యార్ధి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తోటి విద్యార్ధులతో కలిసి బోజనం చేసి నిద్రించిన విద్యార్ది ఏలా అదృశ్యం అయ్యాడో ఎటువంటి సమాచారం లభ్యం కాకపోవడంతో కేసు మిస్టరీగా మారిందని స్దానికులు చర్చించుకుంటున్నారు. తమ బిడ్డ ఆచూకిని వెంటనే కనుగొనాలని విద్యార్ధి తల్లిదండ్రులు తీవ్ర అందోళన చెందుతున్నారు.

## ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బందని జయప్రదం చేయాలి



**కావలి రూరల్, నవంబరు 1 ప్రభాతవార్త** కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈ నెల 8వ తేది నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ని జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో కావలి పెద్దపవని రోడ్డులోని పిజి కళాశాల వద్ద బంద్‌కు సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్. కె. మస్తాన్, జిల్లా కన్వీనర్ ఎస్. కె. మున్నా, డివైఎఫ్‌ఐ కావలి పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచల నరసింహం, ఎస్ఎఫ్ఐ నాయకులు రాకేష్, ఎఐఎస్ఎఫ్ నాయకులు దినేష్‌లు మాట్లాడారు. విద్యార్థి, యువజన నాయకులు 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబరు 8 నాటికి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు అదే రోజు కేజి నుండి పిజి వరకు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. లాభాలు వస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీకి అనుబంధంగా ఇనుము గనులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ పోరాడిన అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేస్తామన్నారు. రాయలసీమ ప్రాంతం కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో పేర్కొన్న హామీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు వస్తాయన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇవ్వకపోయినా, నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయకపోయినా రాష్ట్రంలోని బిజెపి నేతలు మోడీని ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ రాష్ట్ర ప్రయోజనాలు కంటే ముఖ్యమంత్రికి వ్యక్తిగత ప్రయోజనాలే ఎక్కువయ్యాయని దుయ్యబట్టారు. కేసుల భయంతో మోడీ ముందు మోకరిల్లుతున్నారన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం కేంద్రం ఒక్క పైసా కూడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం రెండుసార్లు శంఖుస్థాపనలు చేసినా ఆచరణలో పురోగతి లేదన్నారు. ఈ 8వ తేదిన జరిగే విద్యాసంస్థల బంద్‌కు కావలి పట్టణంలోని ప్రైవేట్ స్కూల్స్, కళాశాలల యాజమాన్యాలు మద్దతు ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎవైఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమృత పథకాన్ని ఎందుకు నిలిపారో ప్రజలకు సమాధానం చెప్పాలి



**కావలి, నవంబరు 1 ప్రభాతవార్త** కావలిలో ప్రజల తాగునీటి కోసం మంజూరైన అమృత పథకాన్ని ఎందుకు నిలిపివేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు డిమాండ్ చేశారు. కావలి మున్సిపాల్టీ పరిధిలోని 15వ వార్డు ముసునూరులో బుధవారం తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాలేపాటి అధిక సంఖ్యలో వచ్చిన తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి మహాలక్ష్మమ్మ దేవాలయంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ బాండును, కరపత్రాలను అమ్మవారి పాదాల వద్ద వుంచి ప్రత్యేక నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టోపై ప్రచారం చేశారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీలో పేర్కొన్న అంశాలను తెలియజేస్తూ రాబోయే ఎన్నికలలో చంద్రబాబుని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. సంవత్సరానికి తెలుగుదేశం పార్టీ ఇచ్చే ఆదాయాన్ని తెలియజేస్తూ బాండు రూపంలో వారికి అందించారు. ప్రజలతో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడుతూ కావలి పట్టణ ప్రజల తాగునీటి సౌకర్యం కోసం మంజూరైన అమృత పథకాన్ని ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. వైసిపి పాలనంతా అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ ప్రజా సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని కావలిలో అమృత పథకాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికలలో వైకాపాకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సంపదను సృష్టించి ప్రజకు పంచే సామర్ధ్య చంద్రబా బు నాయుడుకే వుందని తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, టిడిపి నాయకులు బొట్లగుంట శ్రీహరినాయుడు, జ్యోతిబాబు, తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొట్టిశ్రీరాములుకు ఘనంగా నివాళులు

**వలేటివారిపాలెం నవంబరు 1, ప్రభాతవార్త** వలేటివారిపాలెం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కమలకుమార్ అధ్యతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసినివాళులు అర్పించారు. పలువురు ఉపాధ్యాయులు టీచర్సు సుబ్బరామయ్య, చెన్నారెడ్డి, పి. శైలజ, దామోదర్, మధు, పేరయ్య, ఇరపని మురళీధర్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్డులకు స్వీట్లు పంచారు.

## వలేటివారిపాలెంలో మంగళ, బుధవారాల్లో సంబరాలు

వలేటివారిపాలెం నవంబరు 1, ప్రభాతవార్త మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్కిల్ డెవలప్‌మెంటుకేసులో 4వారాలపాటు హైకోర్టు మద్యంతర బెయిల్ ఇవ్వడంపట్ల వలేటివారిపాలెంలో మంగళ, బుధవారాల్లో పలువురు హర్షం వ్యక్తంచేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం ఆధ్వర్యంలో బస్టాండు సెంటర్‌లో కార్యకర్తలు, నాయకులు బాణా సంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం, సీనియర్ నేతలు వలేటి నరసింహం, కొంకా రమేష్, కొంకా చిరంజీవి, యల్లమందల మహేష్, కాకుమాని ఆంజనేయులుతోపాటు పలువురు పాల్గొన్నారు. అదేవిధంగా తెదేపా మండల అధ్యక్షుడు మాదాలలక్ష్మినరసింహం ఆధ్వర్యంలో మండలంలోని చుండి, బడేవారిపాలెం, పోకూరు, శాఖవరం, శింగమనేనిపల్లె నలదలపూపరు, పోలినేనిపాలెం, కలవళ్ల తదితర గ్రామాల్లో కార్యకర్తలు ఆనందోత్సవాల మద్య బాణాసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు.

## జీతాల కోసం చెత్త సేకరణ చేసే క్లాప్ వాహన డ్రైవర్లు ఆందోళన

కావలి రూరల్, నవంబరు 1 ప్రభాతవార్త కావలి మున్సిపాల్టీ పరిధిలోని చెత్త సేకరణ చేసే క్లాప్ వాహన డ్రైవర్లు గత 5 నెలలు నుండి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని బుధవారం వాహనాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 5 నెలలు నుండి వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకువస్తామన్నారు. మేము అంతా రెడ్డి ఎంటర్‌ప్రైజస్ కింద పనిచేస్తున్నామని తెలిపారు. వారు తమకు వేతనాలు చెల్లించాల్సి వుందన్నారు. సంస్థ ఎండిని అడిగితే 9 నెలల నుండి రాష్ట్ర ప్రభుత్వం మాకు నిధులు ఇవ్వలేదని చెబుతున్నారన్నారు. మా పరిస్థితి ఏమిటని అడిగితే చేస్తే చేయండి పోతే పొండి అని అనడంతో దిక్కుతోచని పరిస్థితిలో వున్నామని తెలిపారు. చేసేదేమి లేక వాహనాలను నిలిపి వాటి వద్దనే నిరసనలు తెలియజేస్తున్నామని తెలిపారు. కావలి పట్టణంలో ఈ వాహనాలు చెత్త సేకరిస్తూ పట్టణ స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ తిరుతున్నాయని అసలే చెత్త సేకరణ వాహనాల కొరతతో మున్సిపాల్టీ ఇబ్బందులు పడుతుందని ఈ క్లాప్ వాహనాలు ఆగిపోతే మరింత దయనీయ పరిస్థితి వస్తుందని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

## గడపగడపకి కార్యక్రమంలో మేకపాటికి అపూర్వ ఆధరణ



**ఉదయగిరి, నవంబర్1, ప్రభాతవార్త** ఉదయగిరి మండలం గండిపాలెం గ్రామంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయనకు గండిపాలెం ఎంపిటిసి గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి మాజీఎంపీటీసీ పాముల రమణయ్య ఆధ్వర్యంలో మహిళలు భారీగా చేరుకుని హారతులతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. గండిపాలెం బస్టాండ్ సెంటర్లో గల వైయస్ విగ్రహానికి సర్పంచ్ కల్పనతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు కుల, మత భేదాలు లేకుండా వాలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి చేరుతున్నాయని ప్రతి ఒక్కరూ రాజకీయ పార్టీలకు అనుగుణంగా లబ్ధిపొందుతున్నారని తెలి పారు. అనంతరం అక్కడి నుండి బిసి కాలనీకి వెళ్లిన ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గండిపాలెంకు చెందిన వైసీపీ నాయకులు కొత్త సచివాలయం కావాలని కోరగా వారికి హామీ ఇస్తూ ఈ విషయాన్ని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి త్వరలోనే సమస్యలను పరిష్కస్తానని తెలి పారు. మండల కన్వీనర్ ఓబులరెడ్డి, ఎంపీడీవో డి. ఈశ్వరమ్మ, ఎమ్మార్వో సానాశ్రీనివాసులురెడ్డి, పంచాయతీ సెక్రటరీ అమరనాధ్‌రెడ్డి, వీఆర్వో బి. వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు షేక్. గఫూర్, రియాజ్, భాషా, రాపల్లి తిరుపలి, కల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, అడుసుమల్లి వెంకటేశ్వర్లు, వైసీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## చెస్ పోటీల్లో సత్తా చాటిన శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థి



**కావలి రూరల్, నవంబరు 1 ప్రభాతవార్త** విక్రమ సింహపురి యూనిర్శిటీ స్థాయిలో ఆత్మకూరు డాక్టర్ ఎస్ఆర్జె డిగ్రీ కళాశాలలో నిర్వహించిన చెస్ పోటీలలో కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల బికాం తృతీయ సంవత్సరం విద్యార్థి కృష్ణవంశీ విజయం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కృష్ణవంశీని అభినందించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బెజవాడ రవికుమార్, డైరెక్టర్ పి.జానకిరామ్, ప్రిన్సిపాల్ పి.వి.రావులు మాట్లాడారు. తమ విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యతో పాటు క్రీడలకు పెద్దపీట వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.తిరుపాల్, యం.రవికాంత్, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

## రాజధానిని ఆంధ్రప్రదేశ్‌కు లేకుండా చేసిన సియం జగన్మోహన్‌రెడ్డి



**కావలి రూరల్, నవంబరు 1 ప్రభాతవార్త** తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరుతో సంక్షేమ పథకాలు పెడుతూ ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేశారని కావలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా 1953 సంవత్సరం అక్టోబరు 1వ తేది కర్నూలు రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందన్నారు. హైదరాబాద్ విలీనం తర్వాత హైదరాబాద్ రాజధానిగా 1956 సంవత్సరం నవంబరు 1వ తేది ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని తెలిపారు. ఇప్పుడు తెలంగాణా నుండి విడిపోయిన అనంతరం సియం జగన్మోహన్‌రెడ్డి రాజధాని లేకుండా చేయడమే కాకుండా తన తండ్రి రాజశేఖర్‌రెడ్డి పేరు మీద పథకాలు పెడుతున్నారన్నారు. రాబోయేది జనసేన, టిడిపి ప్రభుత్వమని అప్పుడు రాష్ట్రం కోసం త్యాగం చేసిన వారు పేర్లు పథకాలకు పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్య, పట్టణ అధ్యక్షులు పొబ్బా సాయివిఠల్, కెఎస్ఎస్ అధ్యక్షులు సాదు శ్రీధర్, ఉపాధ్యక్షులు కృష్ణయ్య, పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు ఆలా శ్రీనాథ్, సుబ్బారావు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నాగార్జున, సుధీర్, మల్లి శ్రీను, బ్రహ్మయ్య, ఆది, ఆనంద్, గాదంశెట్టి రవి, జానీ, జిలానీ, రాజు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలి



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** కోవూరు సబ్ డివిజన్ పరిధిలోని కాలువ నీళ్లపై ఆధారపడి సాగు చేసే రైతులు ప్రస్తుతం నార్లు పోసేందుకు అధికారుల సూచనలు వచ్చే వరకు వేచి ఉండాలని అప్పటిదాకా నార్లు పోయవద్దని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అన్నారు. కోవూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన మండల వ్యవసాయాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐఏబీ సమావేశం ఇంకా నిర్వహించలేదని, ఆ సమావేశంలో నీటికి సంబంధించిన వివరాలు వెల్లడవుతాయని అప్పటిదాకా రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలను తప్పక పాటించాలన్నారు. బోర్ల కింద సాగు చేసే రైతులు నార్లు పోసుకోవచ్చని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టిలన్నారు. వ్యవసాయ అధికారి వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో మండల వ్యవసాయాధికారులు ఇందిరావతి, సురేంద్రరెడ్డి, కృష్ణయ్య, లక్ష్మి, తదితరులు ఉన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడాలి.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** కోవూరులోని ఎన్జీవో కార్యాలయ ప్రాంగణంలో బుధవారం అఖిలపక్ష నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, జనసేన పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం పూర్తిగా కూనీ అయిపోయిందన్నారు. ప్రభుత్వాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే జైలుకు పంపడమే పరమావధిగా పెట్టుకున్నారన్నారు. ప్రభుత్వం ఏసిందే చట్టం, వారు చెప్పిందే న్యాయంగా తయారయిందన్నారు. ఈ ప్రభుత్వం చేస్తున్న దురాచకాలను ప్రజలు ఇప్పటికే గమనిస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులపై కేసులు పెట్టి జైలుకు పంపడమే పరమావధిగా పెట్టుకున్నారన్నారు. ఈ విషయాలన్నీ ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. జనసేన నేతలు షేక్ అల్తాఫ్, ఎం. మున్వర్ బాషా, పవన్‌కుమార్, బాబి, తన్మయ్, సతీష్‌కుమార్, సీపీఐ నేతలు యస్థాని, శ్రీనివాసులురెడ్డి, కాంగ్రెస్ నేతలు కాశీం, మల్లికార్జున, ఉన్నారు.

## పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు



కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు తమ ప్రాణాలు సైతం తృణప్రాయంగా అర్పించిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆత్మార్పణ చేసి ఆ మహనీయుని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో శ్రీమరి కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ముజీబ్, టైపిస్ట్ హుమయున్, సిబ్బంది సుబ్బారావు, డ్వామా ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు ఉన్నారు.

## చేనేత కార్మికులకు వృత్తి పెన్షన్లు మంజూరు చేయాలి



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** చేనేత కార్మికుల్లో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రస్తుతం పనితో సంబంధం లేకుండా వృత్తి పెన్షన్ మంజూరు చేయాలని చేనేత సంఘం జాతీయ కమిటీ సభ్యులు కేవీ శేషయ్య, జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకట సురేష్‌లు పేర్కొన్నారు. కోవూరులోని సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ నెల్లూరు జిల్లా కమిటీ అధ్యక్షుడు భువనగిరి మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి నందం శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చేనేత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట సురేష్ మాట్లాడుతూ జిల్లాలో చేనేతల కొరకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించి ప్రభుత్వమే నిర్మాణం చేయాలన్నారు. చేనేత కార్మికులకు 2 లక్షల రూపాయల ముద్ర రుణాలను, లక్ష రూపాయల సబ్సిడీతో అందజేయాలన్నారు. ప్రస్తుతం చేనేత ఉత్పత్తులపై, ముడి సరుకులపై ఉన్న జీఎస్టీని తీసి వేయాలన్నారు. చేనేత విద్యార్థులకు విదేశీ వ్యి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. చేనేత సొసైటీ నిబంధనలు మార్చి మగ్గం నేసే ప్రతి కార్మికులకు సభ్యత్వం కలిగించి ఆప్కో ద్వారా ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ప్రభాకర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె. రాజా, కె. చంద్రశేఖర్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

## యాజమాన్యం నిర్లక్ష్య దోరణిని విడనాడాలి




**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** ఇనమడుగు సెంటర్‌లో హమాలీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఆందోళన బుధవారం 7 రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ అన్ని గోదాముల్లో ఇస్తునన కూలీని ఇమ్మని ఇడిగినా ఇటువంటి న్యాయమైన సమస్యను యాజమాన్యం కాలయాపన చేయడం సరికాదన్నారు. హమాలీ కార్మికులు చేస్తున్న పోరాటానికి తాము పూర్తిగా సంఘీభావం తెలుపుతున్నామన్నారు. సామరస్యంగా సమస్య పరిష్కారానికి కార్మికులు ప్రయత్నిస్తుంటే యాజమాన్యం మాత్రం సమస్యను జటిలం చేసే విధంగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదన్నారుకూలీ సక్రమంగా ఇవ్వమని అడిగితే యాజమాన్యం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకోకుండా అన్ని గోదాములు ఇస్తున్న కూలీనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు దామోదర్‌రెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసులు, మండల కార్యదర్శి శేషయ్య, నేతలు చాన్‌బాషా, జగదీష్, నాగేశ్వరరావుహరి, ఆదయ్య, మధు, చింటూ , వెంకయ్య ఉన్నారు.

## పేదల వైద్యానికి అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



**రాపూరు, నవంబరు1ప్రభాతవార్త** రాష్టంలోని పేద ప్రజల వైద్యానికి అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలుస్తున్నారని తిరుపతి జిల్లా వైసిపి ఆధ్యక్షుడు, రాష్ట కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తనేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు మండలాలకు చెందినఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్దిదారులకు ఆందజేశారు. మద్దెలమడుగు సెంటర్‌లోని తెలుగుగంగ అతిది గృహంలో బుదవారం రాంకుమార్ రెడ్డి ఈ చెక్కులను ఆందజేశారు. ఇందులో బాగంగా కలువాయికి చెంఇన చల్లా రమాదేవికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 3,80,000లు, రాపూరు మండలంసంక్రాంతిపల్లికి చెందిన కోప్పల సుజాతకు రూ.1,50,000లు కలిపి మొత్తం రూ.5,30,000ల చెక్కులను ఆందజేశారు. రాష్టంలో ప్రజలు ఆరోగ్యంగా వుండాలన్న లక్ష్యంతో డాక్టర్ వైఎస్ ఆర్ ఆరోగ్య శ్రీ తో పాటు, జగనన్నఆరోగ్య సురక్షలు ఏర్పాటు చేయడమే కాకుండా ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులు వచ్చిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సియం జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సియం రిలీఫ్ పండ్ ద్వారా నగదు సాయం పోందిన లబ్దిదారులు మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగలేక లక్షలాదిరూపాయిలు వెచ్చించి వైద్యం చేయించుకోవడం జరిగిందన్నారు. విషయాన్ని రాంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెల్లినవెంటనే స్పందిన ఆయన తమకు ఆర్దీక సాయం ఇప్పించడం పట్ల రాంకుమార్ రెడ్డికి తాము జీవితాంతం రుణపడి వుంటామని తెలిపారు. రాంకుమర్ రెడ్డి వెంట వైసిపి మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్ రెడ్డి, జెసిఎస్‌కన్వీనర్ దందోలు నారాయణ రెడ్డి, వైస్ యంపీపీ పి. పెంచల రెడ్డి, డాక్టర్ ఖాధర్ బాషా, తలుపూరు రాఘవ రెడ్డి, దుగ్గిరెడ్డి నారసింహా రెడ్డి, కయ్యూరు మురళీ మోహన్ రెడ్డి, బోడ్డు మధుసూధన్ రెడ్డి, రేవూరు వరబాబు తదితరులున్నారు.

## వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు అభివృద్ధి,సంక్షేమం



**శానాయపాళెం(రాపూరు), నవంబరు 1ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్ రెడ్డి పాలనలో రాష్టంలోని ప్రజలకు పెద్ద ఎత్తున అభివృద్ధి,సంక్షేమ పథకాలు అందుతున్నట్లు తిరుపతి జిల్లా వైసిపి ఆధ్యక్షుడు, రాష్ట కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. బుదవారం రాపూరు మండలంలోని శానాయపాళెం సచివాలయం పరిధిలోని ఆదూరుపల్లి, శానాయా పాళెం, తాతిపల్లి గ్రామాలలో ఆయనగడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయం పరిధిలోని మూడు గ్రామాలలో ప్రతి ఇంటికి వెల్లి నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో ఆ కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరింది అన్న విషయాలను కరపత్రాలను పంపిణీ చేసి వివరించారు. వచ్చే ఎన్నికలలో ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఓటు వేసి తిరిగి అధికారంలోకి వచ్చేలా చేయాలని కోరారు. ఈయనవెంట గ్రామ సర్పంచ్ కొండూరు విష్ణు ప్రియ, యంపీటీసి కె.శివరావమ్మ, వైసిపి మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్ రెడ్డి, జెసిఎస్‌కన్వీనర్ దందోలు నారాయణ రెడ్డి, వైస్ యంపీపీ పి. పెంచల రెడ్డి, కోండూరు రమేష్, డాక్టర్ ఖాధర్ బాషా, తలుపూరు రాఘవ రెడ్డి, దుగ్గిరెడ్డి నారసింహా రెడ్డి, కయ్యూరు మురళీ మోహన్ రెడ్డి, బోడ్డు మధుసూధన్ రెడ్డి, రేవూరు వరబాబు, పెద్దఎత్తున వైసిపి నాయకులు, యంపీడీఓ, తహశిల్దార్, వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు వున్నారు.

## వైభవంగా శ్రీమహాలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్ట

**జలదంకి, నవంబర్1 ప్రభాతవార్త** ః జలదంకి మండలం జమ్మలపాళెంలో నూతనంగ నిర్మించిన మహాలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతి ష్టా మహోత్సవం బుధవారం వైభవంగ జరిగింది. పండితుల వేదమం త్రోశ్చరణలమద్య ఉదయం విశ్వక్సే నపూజ, పుణ్యాహావా చనము, పంచామృత అభిషేకం, రత్న న్యాసము, యంత్ర, శిఖర ప్రతిష్టలు భక్తుల గోవింద నామస్మరణలమద్య భక్తిశ్రద్దలతో సాగింది. అనంతరం శ్రీమహలక్ష్మమ్మ, శ్రీవినాయక సరస్వతి అమ్మవార్ల విగ్రహాప్రతిష్ట శాస్త్రోక్తంగ నిర్వహిం చారు. కళాన్యాసము, అర్చన, బ్రాహ్మణ గోదర్శనం, కన్యాదర్శనంహారతి, తీర్ధప్రసాద వినియోగం సాంప్రదాయ బద్దంగ చేశారు. మద్యాహ్నాం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కావలికి చెందిన జనిగర్ల మహేంద్రయాదవ్ తమ దానగుణాన్ని మరోమారు చాటుకొని అన్నదాన ప్రభువుగ అందరిచేత కొనియాడబడ్డారు. గ్రామ పెదకాపు దొడ్ల వెంకారెడ్డి, కార్యనిర్వహణలో ముఖ్యపాత్రవహించిన పూజారి వంటేరు ప్రసాద్ ఆద్వర్యంలో అమ్మవారి వేడుక జయ,జయ ద్వానాల మద్య సాగి గ్రామంలో ఆద్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈదేవతా కార్యక్రమానికి ఆడపడుచులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తరించారు. ఆలయ కమిటివారు ప్రత్యేక ఏర్పాట్లు చేసి అందరి మన్ననలను పొందడం విశేషం.

## నిర్మాణ పనులు మరింత వేగవంతం కావాలి



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త :** కోవూరులోని ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ పనులు మరింత వేగవంతం కావాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ అన్నారు. కోవూరులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో బుధవారం సబ: డివిజన్ పరిధిలోని ఏఈలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో కమ్యూనిటీ , శానిటరీ, టాయిలెట్స్ 77 మంజూరు కాగా అందులో 10 పూర్తి అయ్యాయని, మిగిలిన 67 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అదేవిధంగా జలజీవన్ మిషన్‌కు సంబంధించి సబ్ డివిజన్‌కు 282 పనులు మంజూరు కాగా అందులో 120 పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో కొన సాగుతు న్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన ఏఈ వారీగా నిర్మాణ పనుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సమీక్షలో ఏఈలు జగదీష్, హరికృష్ణ, హజరత్తయ్య, రమేష్, వినయ్, తదితరులు ఉన్నారు.

– ట్యాంకులు పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగప్రసాద్ కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్షిత నీటి పథకాల ఓవర్ హెడ్ ట్యాంకును బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ జల్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్‌ను యుద్ధప్రాతిపదికన అందించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. చేపట్టే పనుల్లో తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి అన్నారు. కోవూరు మండలాన్ని హర్ ఘర్ జల్ మండలంగా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తికావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్, ఏఈ జగదీష్ , తదితరులు ఉన్నారు.

## మహానుభావుడు శ్రీపొట్టిశ్రీరాములు




**జలదంకి, నవంబర్1 ప్రభబాతవార్త**ఃఆంధ్రరాష్ట్ర అవతరణకోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు పొట్టి శ్రీరాములని భారతీయ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాద్‌రెడ్డి అన్నారు. బుధవారం జలదంకి బస్టాండ్ సెంటర్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగ నిర్వహించారు. భారతీయ యువమోర్చా మండల అధ్యక్షుడు వంటేరు రాకేష్ ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆంద్రులకోసం ప్రత్యేక రాష్ట్రం అనే నినాదంతో అసువుల బాసిన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వడ్డే శ్రీనాద్‌రెడ్డి, వంటేరు రాకేష్, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాద్యాయుడు కొండారెడ్డి, గ్రామ ఆర్యవైశ్య నేతలు మద్దుల వెంకటరమేష్, పువ్వాడ సురేష్, పెసల మురళి, పబ్బిశెట్టి జనార్దన్ మద్దుల మనోహర్ తదితరులు దివంగత పొట్టి శ్రీరాములు పూల మాలలువేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వడ్డే మాట్లాడుతు తన ప్రాణాలు పోతున్న లెక్కచేయక అమరణ నిరాహారదీక్షచేసి అసువులు బాసిన త్యాగధనుడు పొట్టి శ్రీరాములని కొనియాడారు. ప్రధానోపాద్యాయుడు కొండారెడ్డి మాట్లాడుతు ఆమహనీయుని స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా వుందని అన్నారు. రాకేష్ మాట్లాడుతు రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగ ప్రభుత్వ ధనంతో వైయస్సార్ జీవన సాఫల్య పురష్కారాలు ప్రధానం చేయడం సరికాదని అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు పేరుమీద పురష్కారాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అదే ఆయనకు మనమిచ్చే ఘన నివాళులని స్పష్టంచేశారు. అలాచర్య లు తీసుకోకపోతే తాము పోరాటం చేస్తామని అన్నారు.

## మైనార్టీసెల్ అధ్యక్షుడ్ని అభినందించిన వైసిపినేతలు



**సీతారామపురం నవంబర్ 1 ప్రభాతవార్త** సీతారామపురం మండల వైఎస్ఆర్‌సిపి మైనార్టీసెల్ అధ్యక్షుడుగా షేక్ మున్నా (నాయబ్‌రసూల్) మండల వైసిపి కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి ఎంపిక చేయడం పట్ల సీతారామపురం బిట్.2 సచివాలయం కన్వీనర్ పిడితల ఓబులేస్ వార్డు మెంబర్ దంతిక జైపాల్‌లు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు మున్నాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతు వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలో మైనార్టీలకు అధిక ప్రాధాన్యత వుంటుందని రాబోయే 2024 ఎన్నికలలో ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయానికి మరింత కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల ఎస్‌సిసెల్‌నాయకులు, మైనార్టీసెల్‌నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేజర్లలో ఘనంగా పొట్టిశ్రీరాములుకు నివాళులు



**చేజర్ల, నవంబర్1, ప్రభాతవార్త :** శ్రీపొట్టిశ్రీరాములు 56రోజుల ఆమరణనిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం ద్వారా ఉమ్మడి మద్రాసు రాష్ట్రాం నుండి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఏడాది నవంబర్1న ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు చేజర్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. ఈసందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వా రు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు కారణమైన పొట్టిశ్రీరాములును తెలుగు ప్రజలందరూ ఆద ర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన పోరాట యోధుల త్యాగాలను స్పూర్తిగా తీసుకొని వారి పోరాటాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి సత్తాను తెలియజేసేందుకు అవకాశం కలిగిందన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పువ్వాడ శ్రీనివాసరావ్, రేవతి సుబ్బారావ్, సుధాకర్, జానరధన్‌రావ్, కృష్ణ సురేంద్ర, వెంకటేశ్వర్లు, సురేష్, భానుతేజ, చిన్నహజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాగుండికి మైనార్టీ నేత ఆర్ధిక సహాయం



**పొదలకూరు నవంబర్ 1 ప్రభాతవార్త** పొదలకూరు పట్ట ణంలోని టైలర్స్ కాలనీ లో ఉన్న అంగన్‌వాడీ స్కూ ల్‌లో మూగ చెవుడుతో బాధ పడుతున్న బాలుడికి పట్ట ణానికి చెందిన వైసిపి ము స్లీం నేత 2 వేల రూ పా యాలు ఆర్ధిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముస్లీం నేత అయిన అంజాద్ ఒకటో వార్డు సభ్యుడు మాజీ కోఆప్షన్ ఎంపిటిసి సభ్యులు సచి వాలయం బిట్,1 కన్వీనర్ పనిచేస్తున్న తనకు వ్యవసాయశాఖమంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి ఆదేశాను సారం దివ్యాంగులకు తోడ్పడాలనే ఆశయంతో ఎక్కడ దివ్యాంగులు బాధపడుతున్నా కాకాణి యూత్ అసోసియేషన్ కూడా తక్షణం స్పందిస్తుందని ఆయన తెలిపారు. దివ్యాంగుడు ఎస్‌కె హర్షద్ తల్లిదండ్రులు ముస్లీం నేత అంజాద్‌కు దన్యవాదాలు తెలిపారు. అంగన్‌వాడీ స్కూల్‌లో విద్య అభ్యసిస్తున్న దివ్యాంగుడి ఉపాధ్యాయులు ఎం .వెంకటకుమారి ,ఆదిలక్ష్మి ఈ కార్యక్రమంలో ఉన్నారు.

## ఏపీబీసీ చైతన్య సమితి జిల్లా కమిటీ నియామకం



**నెల్లూరు టౌన్, నవంబరు 1, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సమితి జిల్లా కమిటీ నియామకం బుధవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలోని మినీ బైపాస్ వద్ద ఉన్న జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాల వద్ద జిల్లా కమిటీ నియామకం జరిగింది. ఈ మేరకు నియామక ఉత్తర్వులను అంద జేశారు. ఈ కార్యక్రమానికి ముందు బీసీ చైతన్య సమితి నాయకులు పూలే బొమ్మ వద్ద ర్యాలీ నిర్వ హించారు. అనంతరం పోలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తన్నీరు ఏడుకొండలు కందుకూరు నియోజకవర్గం, జిల్లా అధ్యక్షులుగా పంచేటి భరత్ నెల్లూరు టౌన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీకాంత్ నెల్లూరు టౌన్, జిల్లా ఉపాధ్యక్షులుగా టి.వెంకట రమణయ్య ఆత్మకూరు నియోజకవర్గం, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం.కృష్ణ నెల్లూరు టౌన్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా తన్నీరు రమణయ్య కందుకూరు నియోజకవర్గం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బీసీ రమణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆరం భాగం చంద్రశేఖర్, డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లు, బీసీ చైతన్య సమితి తిరుపతి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, పెద్దఎత్తున బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

## ఘనంగా టీడీపీ నేతల సంబరాలు

**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త** : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బెయి ల్‌పై విడుదల అయిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎన్నోకుట్రలు చేసి 50 రోజులకు పైగా చంద్రబాబు నాయుడుని జైలులో పెట్టినా ఆయన కడిగిన ముత్యంలా బయటకు వచ్చారన్నారు. కేవలం ఈ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి చేస్తుందే తప్ప మరొకటి కాదన్నారు. ఎప్పటికైనా సత్యం, న్యాయం గెలుస్తుందని చంద్రబాబు నాయుడు బెయిల్ రుజువు చేసిందన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ , జనసేన సంకీర్ణ ప్రభుత్వం విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనలకు ఫుల్‌స్టాప్ చెప్పాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం బాణాసంచా పేల్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బాల రవి, వెంకట్, విజయ్‌బాబు, నాగరాజు, జహంగీర్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున్‌రెడ్డి, సుబ్బానాయుడు, శ్రీధర్‌నాయుడు, లక్ష్మీనరసారెడ్డి, మల్లికార్జున, కృష్ణప్రసాద్, రవీంద్రరెడ్డి, మస్తాన్, శ్యామ్ సుందర్‌రెడ్డి, వెంకటరమణమ్మ, హరిబాబు, పెద్ద సంఖ్యలో నాయకులు ఉన్నారు.



## చర్చి పాస్టర్ల అభ్యున్నతికి కృషి చేసింది వైసిపి ప్రభుత్వమే

**బిట్రగుంట, నవంబరు 1 ప్రభాతవార్త** రాష్ట్రంలో క్రైస్తవ ప్రార్ధనా మంది రాల్లో పనిచేసే పాస్టర్లను సమాజంలో గుర్తించి వారికి గౌరవవేతనం మం జూరు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కు తుందని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బో గోలు మండలం తాళ్ళూరులోని క్రైస్తవ ప్రార్ధన మందిరంలో క్రైస్తవ పాస్టర్ల ఆత్మీయ సమావేశంలో బుధవారం ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మసీదులు, చర్చిలు, ధార్మిక సంస్థల అభివృద్ధికి నిధులు ఇవ్వడమే కాకుండా సమాజంలో గుర్తింపు కూడా ముఖ్యమంత్రి తీసుకొచ్చారని తెలిపారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చేదానికి మీరంతా ఆయనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పాస్టర్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి ఆయనను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, నాగులవరం సొసైటీ అధ్యక్షులు సుంకే మాల్యాద్రినాయుడు, పార్టీ నేతలు మేకల శ్రీనివాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త** : కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్షిత నీటి పథకాల ఓవర్ హెడ్ ట్యాంకును బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగప్రసాద్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ జల్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్‌ను యుద్ధప్రాతిపదికన అందించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. చేపట్టే పనుల్లో తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి అన్నారు. కోవూరు మండలాన్ని హర్ ఘర్ జల్ మండలంగా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తికావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్, ఏఈ జగదీష్ , తదితరులు ఉన్నారు.

## ఎంపి వేమిరెడ్డిని కలిసిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి కమీటి



**బుచ్చి నవంబర్ 1 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్ధానం కమీటి,వైసిపి నాయకులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిశారు. వారిని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆహ్వానించారు. ఈనెల 8 వ తేది గుడికి వస్తున్నట్లు ఎంపి చెప్పినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమీటి మెంబర్లు బాలుసుబ్బారావు, కేశవయ్య, కౌన్సిలర్ బెల్లం మల్లారెడ్డి, ఇన్నమూరికృష్ణయ్య, దర్శిబాలు, కాసా శ్రీనివాసులు, గుబ్బాసూరి, కోటయ్య, హరిరెడ్డి తదితరులున్నారు.

## డిసిసిబి బ్యాంక్ ప్రారంభం 3న



**అనుమసముద్రంపేట,నవంబర్1,ప్రభాతవార్త** : మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని బస్టాండ్ సెంటర్‌లో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను ఈనెల 3న ప్రారంభిస్తారని జిల్లా డిసిసిబి ఇన్‌చార్జ్ సిఇఒ జి.ఎం.సరిత, జిఎం ఉషారాణి బుధవారం పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా నూతన బ్రాంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల అభివృద్ధి బ్యాంక్ ముఖ్య ఉద్దేశమన్నారు. బ్యాంకు పరిధిలో వ్యవసాయ రుణాలు , దీర్ఘకాలిక రుణాలు, గృహనిర్మాణాలపై రుణాలు , ఎడ్యుకేషన్ రుణాలు, ఎస్‌హెచ్‌జి రుణాలు అందజేయనున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. డిపాజిట్లపై 11శాతం వడ్డీ అందజేస్తామన్నారు. బ్యాంకులో లాకర్ సౌకర్యాలను అందుబాటులో ఉంచామన్నారు. బ్యాంక్ ప్రారంభోత్సవానికి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమంలో డిజిఎంలు మధుసూధన్‌రావ్, వై.దయార్‌రెడ్డి, మేనేజర్ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**కావలి, నవంబరు 1 ప్రభాతవార్త** ప్రతి ఒక్కరు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతంగా వుండాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని 39,40 వార్డులలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోసం అశువులు బాసిన శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజలకు వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. మెరుగైన వైద్యాన్ని కార్పొరేట్ వైద్యశాలలో పేద ప్రజలకు అందజేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మరలా సియం చేసి ప్రతిపక్ష పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్, ఎయంసి చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు పొనుగోటి అనూరాధ, కనమర్లపూడి వెంకట నారాయణ, షేక్ షాహుల్, దామిశెట్టి సుధీర్‌నాయుడు, కుందుర్తి కామయ్య, తిరివీధి ప్రసాద్, దేగా రామయ్య యాదవ్, కనపర్తి రాజశేఖర్, పుల్లా శ్రీనివాసులురెడ్డి, షేక్ మునీర్‌జాన్, వైద్యులు, వైద్య సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వంతెన కోరకు ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు



**కొడవలూరు నవంబరు 1 ప్రభాతవార్త**: గండవరం 6వ మైల్ కాలువ వంతెన కోరకు మధ్యవర్తులు, దళా రీలు ఎ వరు లేరు అని వంతెనకోరకు ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకు మార్‌రెడ్డి తెలిపారు. కొడ వలూరు మండలంలోని గండవరం 6వ మైల్ కాలువ వంతెన కూలిపోవడంతో కూలిపోయిన వంతెన నిర్మించాలని గతంలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్‌ను మరియు జడ్పీ చైర్మన్ కోరడం జరిగింది. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే అభ్యర్ధన కోరకు జిల్లా కలెక్టర్ ఎం హరినారయన్ జోక్యం కలిగించుకోని, ఆ వంతెన నిర్మాణం కోరకు 19 లక్షల రూ పాలయలను జడ్పీ నిధుల నుండి మంజూరు చేయడం జరిగిందని. ఆ మంజూరు పత్రాని, నెల్లూరు నగరం లోని అయన నివాసం నందు బుధవారం డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, మరియు గండవరం స్థానిక నాయకులకు ఇవ్వటం జరిగిందిని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన రైతులందరికి విజ్ఞాప్తిగా, ఈ కార్యక్రమంలో మధ్యవర్తులు, దళారీలు ఎవరు లేరు అని వంతెన కోరకు ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నేతృత్వంలో, కలెక్లర్ హరి నారాయన్ అశీస్సులతో త్వరగా ఈ వంతెన పూర్తి చేస్తారని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎపిటీసీ పెనాక శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ అడపాల మోహన్‌కృష్ణ, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, అల్లం సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా సంకటహర చతుర్థీ పూజలు



**కోవూరు, నవంబరు 1 ప్రభాతవార్త** : కోవూరులోని వినాయక స్వామి దేవస్థాన ప్రాంగణంలో వెలసి ఉన్న శ్రీ వినాయక స్వామి విగ్రహానికి బుధ వారం సంకటహర చతుర్థీ పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వీరాంజనేయ స్వామి క్యాటరింగ్ అధినేతలు వ్యవహరించారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయండి
## నగర మేయర్ స్రవంతి జయవర్ధన్



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్1,ప్రభాతవార్త** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజనుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులో తేవాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను మేయర్ స్రవంతి జయవర్ధన్ ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్‌లోని మేయర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉన్నత ఆలోచనలతో రూపొందించిన గడపగడపకు కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లి వివిధ సమస్యలను తెలుసుకోగలిగామని తెలిపారు. జిల్లా మంత్రి కాకాణి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, శాసనసభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని మంజూరు చేసిన నిధులను నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు కేటాయించామని తెలిపారు. ఇప్పటివరకు రూరల్ పరిధిలో 13.22కోట్ల రూపాయలతో 158అభివృద్ధి పనులు పూర్తయ్యాయని మరో 3.34కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయని మేయర్ తెలిపారు. అదేవిధంగా టెండర్ల దశలో 191పనులు 15.98కోట్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరితగిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు.